క్లుప్తంగా

నేడు వందే భారత్ రైలు ప్రారంభం

నల్లగొండ టూటౌన్ : సికింద్రాబాద్ నుంచి తిరుపతి వెళ్లే వందే భారత్ రైలు శనివారం మధ్యాహ్నం 12.30 నల్లగొండకు రానున్నట్లు బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మల రాజశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నల్లగొండ రైల్వే స్టేషన్‌లో రైలు ప్రారంభ వేడుకలు నిర్వహించనున్నామని, పట్టణ ప్రముఖులు 12 గంటల వరకు రావాలని కోరారు.

చిట్యాలలో ఆగనున్న వందే భారత్ రైలు

చిట్యాల : భారత ప్రధాని మోదీ శనివారం ప్రారంభించనున్న సికింద్రాబాద్ నుంచి తిరుపతికి వెళ్లే వందే భారత్ రైలు చిట్యాల రైల్వే స్టేషన్‌లో మధ్యాహ్నం 12 గంటలకు కాసేపు ఆగుతుందని రైల్వే స్టేషన్ కమర్షియల్ ఇన్‌స్పెక్టర్ సాయికిరణ్ శుక్రవారం తెలిపారు. వందే భారత్ రైలుకు స్వాగతం పలికేందుకు ప్రజలంతా రావాలని కోరారు.

గౌడ సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్‌గౌడ్



నియామక పత్రం అందిస్తున్న వేములయ్య

చిట్యాల : మండలంలోని గుండ్రాంపల్లి గ్రామానికి చెందిన చెరుకు శ్రీనివాస్‌గౌడ్‌ను అఖిల భారత గౌడ సంఘం చిట్యాల మండల అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కూరెళ్ల వేములయ్యగౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ కార్యక్రమంలో సంఘం జాతీయ కార్యదర్శి మిద్దెల మల్లేశంగౌడ్, మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కేశగోని శ్రీవాణిగౌడ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ అశోక్‌రెడ్డి

చండూరు : మున్సిపల్ కేంద్రంలో 7వ వార్డు కౌన్సిలర్ చిలుకూరి రాధికశ్రీనివాస్ సహకారంతో లయన్స్ క్లబ్ చండూరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సీఐ అశోక్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు గంజి యాదగిరి, ప్రధాన కార్యదర్శి శంకర్‌రెడ్డి, కోడి శ్రీనివాసులు, దోటి వెంకటేశ్ యాదవ్, కుంభం సత్యనారాయణ, కొత్తపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళనాన్ని జయప్రదం చేయండి

మర్రిగూడ : మండల కేంద్రంలో ఈ నెల 9న నిర్వహించే బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మెండు మోహన్‌రెడ్డి, జెడ్పీటీసీ పాశం సురేందర్‌రెడ్డి కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో వారు మాట్లాడారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తోటకూరి శంకర్, సర్పంచ్ నల్ల యాదయ్య, రైతుబంధు సమితి మండల కన్వీనర్ బచ్చు రామకృష్ణ, మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దంటు జగదీశ్వర్, వైస్ ఎంపీపీ కట్కూరి వెంకటేష్‌గౌడ్, పీఏసీఎస్ చైర్మన్లు పందుల యాదయ్యగౌడ్, నర్సింహ, యాదయ్య, జంగయ్య, యాదగిరి పాల్గొన్నారు.

బలగం సినిమా ప్రదర్శన

మర్రిగూడ : మండల పరిధిలోని తమ్మడపల్లిలో శుక్రవారం జగ్గారెడ్డి, ఓంకార్‌యాదవ్, వెంకటేష్‌యాదవ్ ఆధ్వర్యంలో బలగం చిత్రాన్ని ప్రదర్శించారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో విచ్చేసి చిత్రాన్ని వీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొట్టం మాధవిరమేష్, ఎంపీటీసీ గండికోట రాజమణిహరికృష్ణ, రజాక్, శివ యాదవ్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రసూల్‌పురంలో..

నల్లగొండ రూరల్ : నల్లగొండ మండలంలోని రసూల్‌పురంలో బలగం సినిమాను శుక్రవారం రాత్రి ప్రదర్శించారు. గ్రామస్తులంతా ఒకేచోట చేరి సినిమాను వీక్షించారు.

ప్రధాని సభకు భారీగా తరలిరావాలి

రామగిరి(నల్లగొండ) : సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో శనివారం జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు తిప్పర్తి మండలంలోని బీజేపీ కార్యకర్తలు భారీగా తరలిరావాలని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరెల్లి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. శుక్రవారం తిప్పర్తిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు వినయ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి వంగూరి రవిలు పాల్గొన్నారు.

గ్యాస్ స్టౌవ్ బహూకరణ



గ్యాస్ స్టౌవ్ అందజేస్తున్న నరేందర్‌రెడ్డి

మునుగోడు : మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రానికి కస్తూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గ్యాస్ సిలిండర్, స్టౌవ్‌ను ఫౌండేషన్ సభ్యుడు పిన్నింటి నరేందర్‌రెడ్డి బహూకరించారు. ఈ సందర్భంగా కస్తూరి ఫౌండేషన్ చైర్మన్ శ్రీచరణ్‌కు అంగన్‌వాడీ సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు.

గొర్రెల పంపిణీ కొందరికేనా !

- మంజూరైంది 3369 యూనిట్లు
- ఇప్పటివరకు ఇచ్చింది 177 మందికి మాత్రమే
- డీడీ చెల్లించి ఎదురుచూస్తున్న మిగతా లబ్ధిదారులు



ఫిబ్రవరి మాసంలో కొనుగోలు చేసిన గొర్రెలు

మునుగోడు : గొల్ల, కుర్మల ఆర్థిక అభివృద్ధికి ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొర్రెల పంపిణీ పథకం ఆశించిన స్థాయిలో అమలు కావడం లేదు. మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం నియోజకవర్గంలోని గొల్ల, కుర్మలందరికీ గొర్రెలు అందించేందుకు అర్హులైన లబ్ధిదారుల నుంచి రూ. 44వేల వాటాధనం డిపాజిట్ చేయించింది. కానీ గొల్ల, కుర్మలకు గొర్రెలను అందించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారు. తమకు గొర్రెలు ఇప్పించాలని గొల్ల, కుర్మలు ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతులు అందించడంతో గత ఫిబ్రవరి మాసంలో అధికారులు పంపిణీ ప్రారంభించారు. అయితే కొంతమందికి మాత్రమే గొర్రెలను అందించి మార్చి 1వ తేదీ నుంచి నిలిపివేశారు.

177 యూనిట్లు మాత్రమే కొనుగోలు

మునుగోడు ఉప ఎన్నిక సందర్భంగా నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాలకు చెందిన 5600 మంది గొల్ల, కుర్మలను అధికారులు అర్హులుగా గుర్తించారు. అందులో 4784 మంది తమ వాటాధనం రూ. 44వేలు డీడీ రూపంలో గత ఏడాది ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో చెల్లించారు. అందులో 1415 మందికి వివిధ కారణాల వల్ల గొర్రెలు మంజూరు కాలేదు. మంజూరైన 3369 మందిలో ఇప్పటి వరకు 177 మందికి మాత్రమే అధికారులు గొర్రెలు కొనుగోలు చేసి అప్పగించారు. మునుగోడు మండలంలో 109, చండూరు 55, మర్రిగూడ 13 యూనిట్ల చొప్పున మాత్రమే అందజేశారు. అందులో కూడా కొన్ని గొర్రెలను వాటిని అందజేశారు. నాంపల్లి, గట్టుప్పల్ మండలాల్లో నేటికీ ఏ ఒక్కరికి గొర్రెలను అందించలేదు. నిబంధనల ప్రకారం గొర్రెలు రాకపోవడంతో పలువురు లబ్ధిదారులు స్థానిక ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో ఆయన పశుసంవర్ధక శాఖ అధికారులకు ఫోన్‌చేసి నిబంధనల ప్రకారం గొర్రెలను ఎందుకు అందించడం లేదని ప్రశ్నించినట్లు తెలిసింది. 20 గొర్రెలు, 1 పొట్టేలు ఇచ్చేవారి వద్ద కొనుగోలు చేయించాలని ఆదేశించారు. దీంతో సంబంధిత అధికారులు చేసేది ఏమీలేక నెల రోజుల నుంచి గొర్రెల కొనుగోలు పూర్తిగా నిలిపివేశారు. నేటికీ గొర్రెల పంపిణీపై స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. 7 నెలల క్రితం డీడీలు చెల్లించినప్పటికీ నేటికీ గొర్రెలు రాకపోవడంతోపాటు తాము కట్టిన డబ్బులకు రోజురోజుకు వడ్డీ పెరిగిపోతుందని లబ్ధిదారులు వాపోతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని సాధ్యమైనంత త్వరలో గొర్రెలు ఇప్పించాలని లబ్ధిదారులకు కోరుతున్నారు.

గొర్రెలు ఇప్పించాలి



వాటాధనం రూ. 44 వేల డీడీ చెల్లించిన ప్రతి ఒక్కరికీ గొర్రెలు ఇప్పించాలి. మొత్తం 3369 మంది అర్హులు ఉంటే అందులో కేవలం 177 మందికి మాత్రమే ఇప్పించి చేతులు దులుపుకోవడం సరైంది కాదు. గొర్రెల యూనిట్లు మంజూరైన ప్రతిఒక్కరికి గొర్రెలు అందించి గొల్ల, కుర్మల ఆర్థిక అభివృద్ధికి తోడ్పాటు అందించాలి.

–బీసం విజయ్‌యాదవ్, యాదవ సంఘం నియోజకవర్గ నాయకుడు

అంబేద్కర్ జయంతి తరువాత అందిస్తాం

అనివార్య కారణాల వల్ల గొర్రెల పంపిణీ నిలిపివేశాం. అంబేద్కర్ జయంతి తరువాత అర్హులందరికీ అందిస్తాం. కొనుగోలు చేసిన గొర్రెలను రవాణా చేసేందుకు కాంట్రాక్టర్ల కోసం టెండర్లు పిలిచాం. గడువు ఈ నెల 13న ముగుస్తుంది. తక్కువ కోడ్ చేసిన వారికి రవాణా బాధ్యతలు అప్పగించి గొర్రెల కొనుగోళ్లు మొదలుపెడుతాం.

–యాదగిరి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి

సంక్షేమ పథకాలను ప్రచారం చేయండి

- నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



వెలిమినేడులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో గడప గడపకు విస్తృతంగా ప్రచారం చేసి అర్హులు లబ్ధిపొందేలా చేయాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం వెలిమినేడు గ్రామంలో శుక్రవారం జరిగిన బీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు శక్తివంచన లేకుండా పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ రుద్రారపు భిక్షం, కొలను వెంకటేష్‌గౌడ్, సుంకరి యాదగిరిగౌడ్, రాచకొండ కిష్టయ్య, కొలను సతీష్‌గౌడ్, వెలిమినేడు, పెద్దకాపర్తి, చిన్నకాపర్తి, గుండ్రాంపల్లి, ఏపూరు, సుంకెనపల్లి, పిట్టంపల్లి, పేరేపల్లి, బొంగోనిచెర్వు, బోయగుబ్బ గ్రామాలకు చెందిన బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం



నార్కట్‌పల్లిలో నినాదాలు చేస్తున్న వైద్య సిబ్బంది

నార్కట్‌పల్లి : ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల వైద్యశాఖ ఆధ్వర్యంలో సిబ్బంది నార్కట్‌పల్లిలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా డాక్టర్ చరకుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అంకిత భావంతో పనిచేస్తామని వైద్య సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అదేవిధంగా 2022–23 సంవత్సరానికి గాను ఉత్తమ ఆరోగ్య సేవలు అందించిన కె. గీత, బి.నాగమణి, కె. శేఖర్, ఎం.నిర్మలకు ఆరోగ్య దీప్తి పురస్కారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ సుల్తానా, సామాజిక ఆరోగ్య అధికారి శ్రీరాములు, ఆరోగ్య పర్యవేక్షకులు బి.పద్మ, ఎం.చంద్రకళ, శ్రీనయ్య, కిశోర్‌కుమార్, అజుమ్‌కుమార్, స్వామి, పి. శ్రీనయ్య, శైలజ, శ్రీనమ్మ, ధనలక్ష్మి తదితరులు ఉన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో ఆరోగ్యంపై అవగాహన

నల్లగొండ టౌన్ : నీలగిరి ఐఎంఏ ఆధ్వర్యంలో ప్రజలకు జబ్బులపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ పుల్లారావు అన్నారు. శుక్రవారం స్థానిక ఐఎంఏ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని గ్రామాలను, మురికివాడలను దత్తత తీసుకుని ఆరోగ్యంపై సదస్సులు నిర్వహిస్తామన్నారు. అనారోగ్యానికి గురైతే సొంతం వైద్యం చేసుకోకుండా వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్లు సుచరిత, హరినాథ్, హేమలత, శోభారాణి, అనితారాణి, రాజేశ్వరి, శ్రీనివాస్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

నల్లగొండ రూరల్ : ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయుల నోటిఫికేషన్ విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ సీఎం కేసీఆర్ చిత్రపటానికి శుక్రవారం బీసీ స్టడీ సర్కిల్‌లో బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున మాట్లాడుతూ 9231 ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇవ్వడంతో నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు నిండుతుందన్నారు. ఈకార్యక్రమంలో క్రాంతి, శంకర్, బిందుశ్రీ, లలిత, స్వప్న, రేణుక, జయశ్రీ, వాణి, శ్వేత, నవ్య మహేశ్వరి పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రానికి రెండు గంటల ముందే చేరుకోవాలి

శాలిగౌరారం : హైదరాబాద్ పట్టణంలో శనివారం జరుగనున్న ఎస్‌ఐ రాత పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు రెండు గంటల ముందే పరీక్ష కేంద్రానికి హాజరుకావాలని ఎస్‌ఐ సతీష్ సూచించారు. శుక్రవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడారు. హైదరాబాద్‌లో శనివారం ప్రధానమంత్రి నరేంద్రమోదీ పర్యటన ఉన్నందున నగరంలో ట్రాఫిక్ ఆంక్షల కారణంగా పలు మార్గాలను మూసివేయనున్నారన్నారు.

రాజ్యాధికార సాధనకు కృషి చేయాలి



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఆర్‌ఎస్. ప్రవీణ్‌కుమార్

నల్లగొండ టౌన్ : రాబోయే ఎన్నికల్లో రాజ్యాధికారాన్ని సాధించడానికి ప్రతిఒక్కరూ కలిసి రావాలని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన సమక్షంలో పలువురు నాయకులు బీఎస్పీలో చేరారు. పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త అలుగుబెల్లి వేణుగోపాల్‌రెడ్డి, నకిరేకల్‌కు చెందిన స్వామి ఆధ్వర్యంలో వివిధ పార్టీల వారు బీఎస్పీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. రానున్న ఎన్నికల్లో బీఎస్పీని అన్ని స్థానాల్లో గెలిపించుకునేందుకు అన్నివర్గాలను ఏకం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్‌చౌహాన్, ప్రధాన కార్యదర్శి జాడి రాజు, రాష్ట్ర అధికార ప్రతినిధి సాంబశివగౌడ్, రాష్ట్ర మహిళా కన్వీనర్ నర్ర నిర్మల, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బొడ్డు కిరణ్, రాష్ట్ర జోనల్ మహిళా కన్వీనర్ ఇంద్రవల్లి కవిత, జిల్లా ఇన్‌చార్జ్‌లు ఆదిమల్ల గోవర్ధన్, పంబాల అనిల్‌కుమార్, మహిళా నాయకురాళ్లు పోకల ఎలిజబెత్, గోసుకొండ కవిత, జిల్లా ఉపాధ్యక్షుడు కోడి భీమ్‌ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి కత్తుల కాన్షీరాం, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ వంటిపాక యాదగిరి, రంజిత్, గ్యార మారయ్య, పల్లేటి రవీందర్, కూరపాటి కిరణ్, అభిలాష్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న ప్రభుత్వం

రామగిరి(నల్లగొండ) : రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతోందని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్.ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించి నిరుద్యోగులతో మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులకు మంచి చేయాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి లేదన్నారు. బహుజన రాజ్యం వస్తే మండల కేంద్రాల్లోనే స్టడీ హాల్స్, ఏసీ తరగతులు, గ్రంథాలయాలు పెడతామన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



చెక్కులు అందజేస్తున్న గుత్తా సుఖేందర్‌రెడ్డి

నల్లగొండ టూటౌన్ : వివిధ ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందిన 17 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను శుక్రవారం శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సీఎం సహాయ నిధి ఒక వరం లాంటిదని అన్నారు. ఎంతో మంది పేదలకు సీఎం సహాయ నిధి ద్వారా వైద్యానికి డబ్బులు అందుతున్నాయని తెలిపారు. నల్లగొండకు చెందిన 17 మంది లబ్ధిదారులకు రూ.8,14,500 విలువ గల చెక్కులను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

చిట్యాల మండలంలోని ఉరుమడ్లలో..

చిట్యాల : మండలంలోని ఉరుమడ్ల గ్రామానికి చెందిన ఈదుల యాదయ్య ఇటీవల అనారోగ్యానికి గురయ్యాడు. ఆయన వైద్య ఖర్చులకుగాను మంజూరైన రూ.60 వేల విలువగల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును శుక్రవారం రాష్ట్ర శాసన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీటీసీ పోలగోని స్వామి, మర్రి రమేష్, రాచమల్ల వెంకన్న స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గుడ్ ఫ్రైడే వేడుకలు



నల్లగొండలో ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు



కేతేపల్లిలో..



మునుగోడులో..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి



నల్లగొండలో ఏసుక్రీస్తు సిలువ నాటకం

రామగిరి(నల్లగొండ) : లోకహితం కోసమే ప్రభు జీసస్ మరణించాడని ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. గుడ్ ఫ్రైడే వేడుకలను శుక్రవారం పట్టణంలోని చర్చిల్లో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నల్లగొండలోని మరియగిరిపై నిర్వహించిన గుడ్ ఫ్రైడే వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. అనంతరం పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవ భక్తులు ఉపవాస దీక్షలు చేయడంతోపాటు క్రీస్తు గీతాలను ఆలపించారు. ఈ సందర్భంగా క్రీస్తు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ సిలువ ఘటనను నాటక రూపంలో ప్రదర్శించారు. అదేవిధంగా పట్టణంలోని బాప్టిస్టు చర్చి, షాలోం చర్చిల్లో గుడ్ ఫ్రైడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, కౌన్సిలర్లు మాతంగి సత్యనారాయణ, శ్రీనివాస్, మరియరాణి కెథిడ్రల్ రెవరెండ్ ఫాదర్ జోసెఫ్‌రెడ్డి, బిషప్ కౌన్సిలర్ రెవరెండ్ ఫాదర్‌లు ఆరోగ్యం, ఇన్నయ్య, కొంక శ్యాంసన్, పసల శౌరయ్య, చర్చి పెద్దలు ఎం.అంథోనీ, పి.బాలస్వామి, శౌరిరాజు, ఎస్.లూర్దురెడ్డి, బి.బాలశౌరిరెడ్డి, కొండ కిరణ్, ఫౌల్, ఎం.ఆరోగ్యసాత్విక్‌లు పాల్గొన్నారు.

కేతేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో క్రైస్తవులు శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. కేతేపల్లి, ఇనుపాముల, రాయపురం, భీమారం, చెర్కుపల్లి చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. క్రైస్తవులు ఉపవాస దీక్షలు చేశారు. కేతేపల్లిలో నిర్వహించిన సిలువ ప్రదర్శనకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. వేడుకల్లో ఆయా చర్చిల మత గురువులు ఫ్రాంచీస్, జోసెఫ్, చర్చి కమిటీ ప్రతినిధులు పసల ఆరోగ్యం, మాదాను విజయరాజు, మాదాను బాలస్వామి, పాలిశెట్టి జోజప్ప, పసల జోజప్ప, బందా జోసెఫ్, జయరాజు, అమర్‌కుమార్, కాటా విజయ్‌పాల్, గుప్పింటి రాయప్ప, పసల ధనరాజ్, శౌరి పాల్గొన్నారు.

మునుగోడు : మండల కేంద్రంలో శుక్రవారం క్రైస్తవులు గుడ్ ఫ్రైడే వేడుకలను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో ఏసు సిలువ ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫాదర్ ధన్‌రాజ్, జోసఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కనగల్ : దోరెపల్లి గ్రామానికి చెందిన బక్క శ్రీనివాస్ అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతిచెందాడు. కాగా ఆయన కుటుంబానికి ఆర్‌కేఎస్ ఫౌండేషన్ చైర్మన్ పిల్లి రామరాజు రూ.10,000, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు, స్థానిక సర్పంచ్ అయితగోని యాదయ్యగౌడ్ రూ. 5000, వేమిరెడ్డి రవీందర్‌రెడ్డి రూ.5000 అందజేశారు. వారి వెంట ఉప సర్పంచ్ దాసరి వెంకన్న, మాదగోని సైదులుగౌడ్, సుంకిరెడ్డి వేమారెడ్డి, శంకర్‌రెడ్డి, బక్క రాజశేఖర్, శంకర్‌గౌడ్, నరేష్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, మారయ్యగౌడ్, శ్రీనివాస్, లింగయ్య, నరసింహ, ఆసిఫ్, భీష్మ, యాదగిరి, మహేష్ ఉన్నారు.

ప్రారంభానికి నోచుకోని బీటీ రోడ్డు పనులు

- నిధులు మంజూరై ఏడాది కావొస్తున్నా పనుల్లో జాప్యం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు




అధ్వానంగా ఉన్న దర్వేశిపురం-చర్లగౌరారం మధ్య ప్రధాన రోడ్డు

కనగల్ : దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని చందంగా మారింది మండలంలోని దర్వేశిపురం శ్రీరేణుకా ఎల్లమ్మ దేవస్థానం నుంచి చర్లగౌరారం–కుమ్మరిగూడెం–తిమ్మన్నగూడెం–తేలకంటిగూడెం పీడబ్ల్యూ రోడ్డు వరకు నిర్మించతలపెట్టిన బీటీ రోడ్డు పరిస్థితి. ఐదు గ్రామాల మీదుగా ఉన్న మట్టి రోడ్డును బీటీగా మార్చేందుకు ప్రధానమంత్రి గ్రామ్ సడక్ యోజన కింద రూ.3.65కోట్ల నిధులను మంజూరు చేసి ఏడాది కావొస్తుంది. కేంద్ర ప్రభుత్వం వాటా కింద 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద 40శాతం నిధులతో ఈ రోడ్డు పనులు చేపట్టాల్సి ఉన్నా ముందుకు సాగడం లేదు. రోడ్డు పనులకు నిధులు మంజూరైన సమయంలో మేము తీసుకొచ్చామంటే మేమే తీసుకొచ్చామని కనగల్ మండలంలోని పలు పార్టీల నాయకులు గొప్పలు చెప్పుకున్నారు. కానీ ఇప్పుడు పనులు పూర్తి కాకపోవడంతో ఇప్పుడెందుకు మాట్లాడడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతోనే పనుల్లో జాప్యం జరుగుతోందని సంబంధిత అధికారులు పేర్కొంటున్నారు.

గత ఏడాది జూన్‌లో శంకుస్థాపన

గత ఏడాది జూన్ మాసంలో ఈ రోడ్డు పనుల ప్రారంభానికి సంబంధించి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. నాటినుంచి నేటివరకు పనుల ఊసేలేదు. శిలాఫలకం శంకుస్థాపనకే రోడ్డు పనులు పరిమితమయ్యాయని ఆయా గ్రామాల ప్రజలు, ఈ రోడ్డు మీదుగా ప్రయాణించే వాహనదారులు అంటున్నారు. దర్వేశిపురం రేణుకాఎల్లమ్మ ఆలయం నుంచి దర్వేశిపురం గ్రామం, మంచినీళ్లబావి, చర్లగౌరారం, కుమ్మరిగూడెం, తిమ్మన్నగూడెం, తేలకంటిగూడెం గ్రామాల వరకు ఉన్న మట్టి రోడ్డు అధ్వానంగా తయారైంది. ఈ రోడ్డుపై ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలు వర్షం వచ్చిన సమయంలో వరద నీటితో నిండి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. దీంతో వాహనదారులు ఈ రోడ్డు వెంట రావాలంటే నానా తంటాలు పడాల్సి వస్తుంది. ఈ రోడ్డు పనులు పూర్తిచేస్తే ఆయా గ్రామాల ప్రజలకు దూరభారం తగ్గడంతోపాటు దేవరకొండ ప్రధాన రహదారి గుండా ఆలయానికి రావడానికి చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది.


రోడ్డు పనులు ప్రారంభించాలి



పనులు ప్రారంభించి సంవత్సరం కావొస్తున్నా ముందుకు సాగడం లేదు. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి. దశాబ్దాల కల నెరవేరిందని సంతోష పడ్డాం. ప్రజాప్రతినిధుల అలసత్వం, అధికారుల నిర్లక్ష్యం రోడ్డు పనుల్లో కనిపిస్తుంది. కాంట్రాక్టర్‌తో మాట్లాడి రోడ్డు పనులను ప్రారంభించే విధంగా చూడాలి.

– తొరకొప్పుల నాగరాజు దర్వేశిపురం

ఇబ్బందులు పడుతున్నాం



మట్టి రోడ్డు మీదుగా ప్రయాణించాలంటే చాలా ఇబ్బందులు పడుతున్నాం. వర్షం వస్తే మా బాధలు వర్ణనాతీతం. రోడ్డు పనులు పూర్తయితే మాకు కనగల్‌తో పాటు దేవరకొండ ప్రధాన రహదారి, దర్వేశిపురం ఎల్లమ్మ ఆలయానికి రావడానికి చాలా దగ్గరవుతుంది. ఇప్పటికైనా బీటీ రోడ్డు పనులు చేపట్టాలి.

– చింతల బ్రహ్మయ్య

కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు

కాంట్రాక్టర్ ముందుకు రాకపోవడంతోనే రోడ్డు పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇప్పటికే కాంట్రాక్టర్ రెండు లక్షలు ఖర్చు పెట్టి రోడ్డుకు ఇరువైపులా కొద్ది దూరం మట్టి పోయించాడు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పనులను త్వరలో ప్రారంభించేలా చూస్తాం.

– శ్రీనివాస్, పీఆర్ ఏఈ

బండి సంజయ్ ఫ్లెక్సీ దహనం



నినాదాలు చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

నార్కట్‌పల్లి : పదో తరగతి పరీక్ష పేపర్ల లీకేజీ విషయంలో బండి సంజయ్‌ని కఠినంగాగా శిక్షించాలని కోరుతూ శుక్రవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్, బీఆర్‌ఎస్‌వీ ఆధ్వర్యంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఫ్లెక్సీని దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన విభాగం మండల అధ్యక్షుడు పుల్లెంల వెంకట్, పట్టణ అధ్యక్షుడు నడింపల్లి మహేష్, మండల ఉపాధ్యక్షుడు రమేష్, నాయకులు నరేష్, శాంతిరెడ్డి, మహేష్, శివ, శంకర్, కార్తీక్, శివ శంకర్, సతీష్, అభి, మచ్చగిరి తదితరులున్నారు.

గట్టుప్పల్-దిల్‌సుఖ్ నగర్ బస్సు ప్రారంభం

చండూరు(గట్టుప్పల) : గట్టుప్పల మండల కేంద్రం నుంచి దిల్‌సుఖ్ నగర్‌కు (హయత్‌నగర్ డిపో బస్సు) మెట్రో బస్సు శుక్రవారం ప్రారంభమైంది. గట్టుప్పల నుంచి ఉదయం (నైట్ హాల్ట్) 5.15 నిమిషాలకు బయలుదేరి (పుట్టపాక మీదుగా) చౌటుప్పల్, దిల్‌సుఖ్ నగర్‌కు 7.30 చేరుకుంటుంది. తిరిగి దిల్‌సుఖ్‌నగర్‌లో ఉదయం 7.30 గంటలకు బయలుదేరి గట్టుప్పల్‌కు 9.30 కి చేరుకుంటుంది. తిరిగి 11.30 దిల్‌సుఖ్ నగర్‌కు చేరుకుంటుంది. మధ్యాహ్నం 3 గంటలకు దిల్‌సుఖ్ నగర్ నుంచి బయలుదేరి గట్టుప్పలకు సాయంత్రం 5.15 కు చేరుకుంటుంది. తిరిగి దిల్‌సుఖ్‌నగర్ చేరుకున్న అనంతరం 7.30 కు బయలుదేరి రాత్రి 9.30 కు గట్టుప్పల్ (నైట్‌హాల్ట్)కు చేరుకుంటుంది.

సీపీఐ పాదయాత్రను జయప్రదం చేయాలి

నకిరేకల్ : జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలని కోరుతూ ఈ నెల 14 నుంచి మే 14 వరకు సీపీఐ ఆధ్వర్యంలో చేపట్టబోయే పాదయాత్ర, ప్రచార జాతాలను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం కోరారు. నకిరేకల్‌లో శుక్రవారం జరిగిన సీపీఐ నియోజకవర్గ కౌన్సిల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈసమావేశంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదరి లొడంగి శ్రవణ్‌కుమార్, మండల కార్యదర్శులు గౌని లక్ష్మీనర్సయ్య, ఎండీ అక్బర్, పెండ్యాల శంకర, బొడిగ సైదులు, జహంగీర్, వెంపటి శ్రీనివాస్, జిల్లా సత్యం పాల్గొన్నారు.

చండూరులో ఇఫ్తార్

చండూరు : కాంగ్రెస్ పార్టీ చండూరు మున్సిపల్ అధ్యక్షుడు వడ్డేపల్లి భాస్కర్ ఆధ్వర్యంలో స్థానిక మజీద్‌లో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కల్లెట్ల మారయ్య, బొమ్మకంటి శేఖర్, దేవా, కర్నాటి శ్రీనివాస్, శంకర్, సోము లింగస్వామి, తదితరులు పాల్గొన్నారు.